క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాజులూరు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు కాకినాడ ఏపీఈపీడీసీఎల్ డీఈ జి.ప్రసాద్ తెలిపారు. బుధవారం గొల్లపాలెం సబ్‌స్టేషన్ ఏఈ ఎం.సూర్యనారయణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ లైన్ల మరమ్మతులు, ట్రీ కటింగ్ పనుల్లో భాగంగా ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కాజులూరు, తిప్పరాజుపాలెం, అయితపూడి, ఒంటితాడి విద్యుత్ లైన్లలోని గృహావాసాలకు, ఇండస్ట్రియల్ ఫీడర్, ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరా నిలిపివేయవలసి వస్తుందన్నారు. అంతరాయానికి చింతిస్తున్నామని ప్రజలు సహకరించాలన్నారు.

నేడు పుట్టాలమ్మ జాతర


పుట్టాలమ్మ వారు

కె.గంగవరం: గ్రామంలో కొలువైన గ్రామ దేవత పుట్టాలమ్మ అమ్మవారి జాతరను గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతర సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి, ఆలయానికి రంగులు, విద్యుత్‌దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. రాత్రి ఆలయం గరగ నృత్యాలతో పాటు పలు సాంస్కృతిక నిర్వహించారు. జాతర అనంతరం శుకవారం ఆలయం వద్ద తీర్థం నిర్వహించబతుందని భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవాలని కమిటీ సభ్యులు తెలిపారు.

పోలింగ్ బూత్‌ల తనిఖీ

రాయవరం: మండలంలోని పలు పోలింగ్ బూత్‌లను మండపేట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి డీవీఎస్ ఎల్లారావు బుధవారం సందర్శించారు. రాయవరం, లొల్ల, సోమేశ్వరం, వెదురుపాక, వి.సావరం, సోమేశ్వరం, మాచవరం, పసలపూడి గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను ఆయన తనిఖీ చేశారు. పోలింగ్ బూత్‌ల్లో మంచినీరు, విద్యుత్, ర్యాంప్ వంటి మౌలిక సదుపాయాలు ఉన్నాయా? లేదా? తదితర విషయాలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దారు ఆర్‌వీ కృష్ణారావు, ఆర్ఐ పంపన రామారావు తదితరులు పాల్గొన్నారు.

పోతురాజు ఆలయ హుండీ ఆదాయం రూ.5.43 లక్షలు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలంలోని కేశవరంలోని గని పోతురాజు ఆలయ హుండీని దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో ఆలయ అధికారులు ఆధ్వర్యంలో బుధవారం లెక్కించారు. ఆలయ కమిటీ చైర్మన్ కూసు నరసింహమూర్తి, ఈఓ శ్రీనివాసరావు సమక్షంలో జనవరి 09 నుంచి బుధవారం వరకూ భక్తులు హుండీలో వేసిన కానుకలను లెక్కించారు. రూ.5,43,594 స్వామికి కానుకలుగా అందినట్టు లెక్క తేలినట్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పురంశెట్టి శ్రీను, మనుపూడి వీరన్న, వార్డు సభ్యులు అల్లంపల్లి కిశోర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు తుపాకుల ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణపై అవగాహన పెంచాలి

రామచంద్రపురం: చిన్నారుల్లో నులిపురుగు నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను అందించాలని దీనిపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని సబ్ డివిజనల్ వైద్యాధికారి ఎస్.ప్రశాంతి విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని రత్నంపేట హైస్కూల్‌లో నేషనల్ డి వార్మింగ్ డే కార్యక్రమంపై రామచంద్రపురం మండల ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాల ప్రిన్సిపాల్స్, స్కూల్ హెచ్‌ఎంలకు అంగన్వాడీ సిబ్బందికి , ఆరోగ్య సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంపై డాక్టర్ ఎస్.ప్రశాంతి మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా 1-5 సంవత్సరాల పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల్లో, 6-19 సంవత్సరాల పిల్లలకు పాఠశాలలు, కళాశాలలో ఆల్బెండజోల్ మాత్రలు ఈనెల 9 తారీఖున మింగించాలని తెలిపారు. డాక్టర్ డి హేమ సుధీర్ మాట్లాడుతూ ఈ మాత్రలు వేసుకోవడం ద్వారా పిల్లల్లో రక్తహీనతను నివారిస్తుందని చదువుపై ఏకాగ్రతను నేర్చుకునే సామర్థ్యాన్ని పరోక్షంగా పెంచుతుందని తెలిపారు. రామచంద్రపురం మండలంలో మొత్తం 23,818 పిల్లలకు ఈ మాత్రలు మింగించాలని తెలిపారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎంఈవోలు శ్రీనివాసరావు, నాగేశ్వరి, ప్రిన్సిపాల్స్, ప్రధానోపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

రామచంద్రపురం రూరల్: ప్రస్తుత రబీ సీజన్‌లో రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ఐ.మంజు విలేకరులకు తెలిపారు. సామాజిక తనిఖీలో భాగంగా బుధవారం ద్రాక్షారామ రైతు భరోసా కేంద్రాన్ని, సహకార సంఘాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. కియోస్క్‌లో ఎరువుల నిల్వలకు సంబంధించిన సమాచారం పరిశీలించారు. గోడౌన్‌లో నిల్వ ఉన్న ఎరువులు సమాచారం మేరకు ఉన్నవీ లేనివీ తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్, ద్రాక్షారామ పీఏసీఎస్ చైర్మన్ దామిశెట్టి వీవీ చంద్రశేఖర్, సీఈఓ పెంకే సత్యనారాయణ, ఆర్‌బీకే సిబ్బంది సీహెచ్ రాజ్‌కుమార్, హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల వేళ .. పాటించాలి ఇలా..

- మార్చి1 నుంచి ఇంటర్, మార్చి 18 నుంచి పది పరీక్షలు
- తెల్లవార్లూ చదవడం నిష్ఫలం
- తగినంత నిద్ర, పౌష్టికాహారం తప్పనిసరి
- ప్రమాదాలకు దూరంగానూ ఉండాలి
- పరీక్షల నేపథ్యంలో వైద్యులు, సామాజిక వేత్తల సూచనలు


అంగర కళాశాలలో ఇంటర్ విద్యార్థులు

కపిలేశ్వరపురం: పరీక్షలంటే విద్యార్థులను సహజంగానే ఆందోళన, భయం వెంటాడతాయి. ఏడాదిగా నేర్చుకున్న దానిని అక్షర రూపం ఇచ్చే పరీక్షలకు అనేక కోణాలున్నాయి. గంటల తరబడి చదువుతూ కూర్చోవడమే పరీక్షలకు సన్నద్ధం కాదనీ, ప్రణాళికాబద్ధంగా విద్యార్థికి ఉన్న అనుకూలత, అవకాశం, ఆసక్తి ఆధారంగా సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు, సామాజిక వేత్తలు అంటున్నారు. ఆ నేపథ్యంలో విద్యార్థులకు వైద్యులు, సామాజిక కార్యకర్తలు చేస్తున్న సూచనలపై ఈ కథనం...

రెండు నియోజకవర్గాలో..

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో 64 ప్రభుత్వ పాఠశాలల్లో 4,500 మంది, ప్రైవేట్ పాఠశాలల్లో 1,500 మంది విద్యార్థులు మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. 14 జూనియర్ కళాశాలల్లో వేలాది మంది మార్చి 1న నుంచి పరీక్షలు రాయనున్నారు. వారిలో అత్యధికులు గ్రామీణ ప్రాంత విద్యార్థులు.

పదో తరగతి పరీక్షల షెడ్యూల్ ఇలా...	
మార్చి 18	తెలుగు
మార్చి19	సెకండ్ లాంగ్వేజ్(హిందీ)
మార్చి 20	ఇంగ్లిషు
మార్చి 22	మేథ్స్
మార్చి 23	ఫిజిక్స్
మార్చి 26	బయలాజికల్ సైన్స్
మార్చి 27	సోషల్ స్టడీస్

ఇంటర్మీడియట్ పరీక్షల షెడ్యూల్ ఇలా..

తేదీ	ఫస్టియర్	సెకండియర్
సెకండ్ లాంగ్వేజ్	మార్చి 01	మార్చి 02
ఇంగ్లిష్	మార్చి 04	మార్చి 05
మేథ్స్‌ఎ	మార్చి 06	మార్చి 07
బోటనీ	మార్చి 06	మార్చి 07
సివిక్స్	మార్చి 06	మార్చి 07
మేథ్స్ బి	మార్చి 09	మార్చి 11
జువాలజీ	మార్చి 09	మార్చి 11
హిస్టరీ	మార్చి 09	మార్చి 11
ఫిజిక్స్	మార్చి 12	మార్చి 13
ఎకనామిక్స్	మార్చి 12	మార్చి 13
కెమిస్ట్రీ	మార్చి 14	మార్చి 15
కామర్స్	మార్చి 14	మార్చి 15
సోషియాలజీ	మార్చి 14	మార్చి 15

పరీక్షలను ఆందోళనతో చూడొద్దు



పరీక్షలను భయంగానో, ఆందోళనగానో, ఇతర విద్యార్థులపై చేస్తున్న యుద్ధంగానో చూడరాదు. ఏడాదిగా తరగతి గదిలో విన్న, చదివిన అంశాలను క్రోడీకరించి రాసుకునే నోట్సులా పరీక్షలు చూడాలి. ప్రణాళికాబద్ధంగా చదవడంవతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యంపై కూడా దృష్టి సారించాలి. జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, అజీర్తి లాంటి చిన్నపాటి సమస్య వచ్చినా వైద్యుడిని సంప్రదించి సమస్య పెద్దది కాకుండా చూసుకోవాలి.

–చల్లా మెహర్ ప్రసన్న, హోమియో వైద్యురాలు, మండపేట

రోడ్లపై జాగ్రత్తగా ఉండాలి



విద్యార్థులు ప్రమాదాల్లో గాయపడితే పరీక్షలపై ప్రభావం పడుతుంది. పది, ఇంటర్ విద్యార్థులకు వయస్సు రీత్యా వాహనాన్ని నడిపే అర్హత లేనందున వాటిని నడుపుతూ పరీక్షలకు వెళ్లడం సరి కాదు. పరీక్ష ఉన్నా లేకపోయినా పెద్దగా అవసరం లేని పనుల కోసం వాహనాలపై ప్రయాణాలు మంచిది కాదు. అర గంట ముందే పరీక్ష కేంద్రానికి వెళ్లేలా చూసుకోవాలి.

–అందే పరదేశి, ఎస్సై, అంగర

చదవుతో పాటు ఆహారంపైనా దృష్టి



విద్యార్థి తీసుకునే ఆహారం అతడి మనసుపై, శరీరంపై ప్రభావితం చూపుతుంది. పరీక్షల సమయంలో మానసికం గానూ, శారీరకం గానూ ఆరోగ్యంగా ఉండడం అవసరం. పోషక విలువల కోసం రోజూ ఒక పండు, వారంలో రెండు రోజులు ఆకు కూరలు విధిగా ఆహారంలో ఉండేలా చూసుకోవాలి. అరుగుదలకు ఇబ్బంది గల మాంసాహారాన్ని మాని, పరీక్షలయ్యే వరకూ సాత్వికాహారాన్ని తీసుకోవడం మంచిది.

–డాక్టర్ జీవీ గీతాంజలి, అంగర పీహెచ్‌సీ, కపిలేశ్వరపురం మండలం

తగినంత నిద్ర అవసరం



శరీరం, మనస్సు ఒక దానికొకటి అవినాభావ సంబంధం కలిగి ఉంటాయి. పరీక్షలంటేనే రాత్రి తెల్లవార్లూ చదువుకోవడమనే ఆలోచన అశాస్త్రీయం. ఎంత సమయం చదివామన్న దానికంటే మెదడులో నిక్షిప్తమయ్యే నాణ్యతతో ఎంతసేపు చదివామన్నది ముఖ్యం. చదవడంతో పాటు రోజుకు కనీసం ఆరు గంటలు నిద్ర అవసరమని గుర్తించాలి.

డాక్టర్ ఎస్.ప్రశాంతి, ద్రాక్షారామ పీహెచ్‌సీ, రామచంద్రపురం మండలం

వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తాం



పరీక్ష కేంద్రాల వద్ద ఆరోగ్య శాఖ సమన్వయంతో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తాం. శిబిరాల్లో అత్యవసర మందులు అందుబాటులో ఉంచుతాం. విద్యార్థులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే సమీప పీహెచ్‌సీలోని వైద్యులను సంప్రదించాలి.

–కె. తాతారావు, ఎంఈఓ, కపిలేశ్వరపురం

సహకార పాలకవర్గాలు మరో 6 నెలలు పొడిగింపు


కోఆర్డినేటర్ సూర్యప్రకాశ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న ద్రాక్షారామ పీఏసీఎస్ చైర్మన్, సభ్యులు

రామచంద్రపురం రూరల్: నియోజకవర్గంలోని 31 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాలను స్వల్ప మార్పులతో మరో 6 నెలల గడువు పొడిగించి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు బుధవారం ఆయా పాలక వర్గాలు బాధ్యతలు స్వీకరించారు. జనవరి 31 నుంచి జూలై 31 వరకు లేదా ఎన్నికలు ఎప్పుడు జరిగితే అప్పటి వరకు పాలకవర్గాలకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఈ మేరకు ద్రాక్షారామ ఏపీసీఎస్ చైర్మన్ దామిశెట్టి వీరవెంకటచంద్రశేఖర్, సభ్యులు కొర్ల వెంకట సూర్యనారాయణమూర్తి, ముషిణి గోవిందరాజులు బుధవారం బాధ్యతలు స్వీకరించి నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా తమకు మరోసారి అవకాశం కల్పించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

జగనన్న సురక్షతో పేదల ఆరోగ్యం మెరుగు

కపిలేశ్వరపురం (మండపేట): జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలతో పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్యం మెరుగవుతోందని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అన్నారు. పట్టణంలోని 14, 16, 17వ వార్డులకు స్థానిక వాసవీ కన్యకా పరమరేశ్వరి ఫంక్షన్ హాల్లో బుధవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని చైర్ పర్సన్ దుర్గారాణి ప్రారంభించారు. పలు విభాగాల వైద్య నిపుణులు కన్యాకుమారి, టి.పవన్, కోటేశ్వరరావు, రమ్య రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ టి.కనకరాజు, కౌన్సిలర్ శెట్టి కళ్యాణి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు సూర్యప్రకాశ్ పరామర్శ


సర్పంచ్ కల్యాణి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సూర్యప్రకాశ్

కె.గంగవరం: మండలంలోని పామర్రులో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బాధిత కుటుంబాలు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్య ప్రకాశ్ బుధవారం పరామర్శించారు. పామర్రు శ్రీరాం నగర్ కాలనీకి చెందిన కడలి శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. వీరి కుటుంబాన్ని సూర్య ప్రకాష్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి కుటుంబాన్ని ఆదుకుంటామని తెలిపారు. అముజూరు సర్పంచ్ నానాపరపు కళ్యాణి తండ్రి వెంకట్రావు ఇటీవల మృతి చెందారు. వీరి కుటుంబాన్ని కూడా సూర్యప్రకాశ్ పరామర్శించారు. నానాపరపు శ్రీనివాస్, సర్పంచ్ వాసంశెట్టి వెంకట దుర్గ, నాయకులు సాదే కపిల్, సూరిబాబు పలు గ్రామాల సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

రామచంద్రపురం: పట్టణం మూడో వార్డు అంకంవారి వీధిలో వైఎస్సార్ సీపీ నాయకుడు కొసనా ప్రసాద్‌ను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్య ప్రకాశ్ బుధవారం పరామర్శించారు. ప్రసాద్ మాతృమూర్తి కొసనా సూర్యవతి ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. ప్రసాద్ కుటుంబ సభ్యులను కలసి పరామర్శించి వారికి సంతాపాన్ని తెలియజేశారు. పార్టీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, పార్టీ నేతలు గుత్తుల వీరన్నశెట్టి, బంగారు బాబు, పోలినాటి వరప్రసాద్ తదితరులున్నారు.

దాతల సహకారం మరువలేనిది


విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తదితరులు

కాజులూరు: గ్రామాల్లో పేద విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వంతో పాటు పలువురు దాతలు అందిస్తున్న సహకారం ఎన్నటికీ మరువలేనిదని కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్ అన్నారు. స్థానిక ప్రభుత్వ కళాశాలల్లో విద్యనభ్యసిస్తూ విద్యపై ప్రతిభ కనబరుస్తున్న కేతా వేణు, టేకుమూడి బిందుశ్రీ, పోతురాజు ప్రపూర్ణ, పెంకే కుసుమ, తీరంశెట్టి ఆదిలక్ష్మి, ద్రోనాద్రి హేమలక్ష్మి, కుడుపూడి పార్థసారథి, సలాది కృష్ణవేణి తదితర విద్యార్థులకు హైదరాబాదుకు చెందిన జామి రామకృష్ణ రూ.12 వేలు ఆర్థిక సహకారాలు అందజేయగా సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కళాశాల లైబ్రరి, సైన్స్ అధ్యాపకుడు, విళ్ల భీమేశ్వరరావు ప్రోత్సాహంతో ఆయన మిత్రుడు జామి రామకృష్ణ గత మూడేళ్లుగా కళాశాల విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నారన్నారు. ఆయనకు ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్, అధ్యాపక బృందం, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాలతో ఆరోగ్యకర సమాజం


కేదారిలంకలో మాట్లాడుతున్న సర్పంచ్ వీధి వెంకటరెడ్డి

కపిలేశ్వరపురం: ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి అంగన్‌వాడీ కేంద్రాలు దోహద పడతాయని సర్పంచుల సమాఖ్య మండపేట నియోజకవర్గ అధ్యక్షుడు వీధి వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు యర్రంశెట్టి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని కేదారిలంకలో బుధవారం సన్ గ్రూప్, క్రై సంస్థ, ఆలమూరుకు చెందిన శ్రమ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యలో నిర్వహించిన అంగన్‌వాడీ కేంద్రాల ప్రాధాన్యత సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో కళాజాతా నిర్వహించారు. పోషకవిలువలున్న ఆహారం ప్రాధాన్యతను తెలియజేస్తూ పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. నాటిక, ఉపన్యాసం రూపాల్లో చిన్నారుల తల్లిదండ్రులు, అంగన్‌వాడీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ యర్రంశెట్టి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

టీపీడీ మాడ్యూల్స్‌ను వారాంతంలోగా పూర్తి చేయండి

- ఉప విద్యాశాఖాధికారి నర్సింహ ఫణి


సమావేశంలో మాట్లాడుతున్న ఉప విద్యాశాఖాధికారి నర్సింహఫణి

రామచంద్రపురం: వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడం కోసం రూపొందించిన ఇంగ్లిష్ పెడగాగి మూడు మాడ్యూల్స్‌తో పాటుగా పోస్ట్ టెస్టును ఈ నెల 11లోగా పూర్తి చేయాలని ఉప విద్యాశాఖ అధికారి నర్సింహ ఫణి ఆదేశించారు. రామచంద్రపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమావేశపు హాలులో బుధవారం మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో ఉప విద్యాశాఖ అధికారి నరసింహ ఫణి మాట్లాడుతూ విద్యాశాఖ ద్వారా అమలయ్యే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఫిర్కి యాప్ ద్వారా లాగిన్ ఐడీలు పొందిన ఉపాధ్యాయులు టీపీడీ మాడ్యూల్స్ ప్రతి ఒక్కరూ కచ్చితంగా పూర్తి చేయాలన్నారు, అలాగే టీచింగ్ అబ్జర్వర్ వారి లక్ష్యాల మేరకు అబ్జర్వేషన్ పూర్తి చేయాలన్నారు. వచ్చే నెల 18వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్నందున విద్యార్థులను పరీక్షలకు సంబంధం చేయాలన్నారు. సమావేశంలో సమగ్ర శిక్షా ఏఎంఓ పి.రాంబాబు మాట్లాడుతూ జిల్లాలో 1648 మంది ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు టీపీడీ మాడ్యూల్స్ పూర్తి చేయాల్సి ఉందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు కేవలం 29 శాతం మంది మాత్రమే పూర్తిస్థాయిలో మాడ్యూల్స్ పూర్తి చేశారన్నారు. మాడ్యూల్స్ కంప్లీట్ చేయడంలో ఇబ్బందులు ఎదురైనప్పుడు 9390299373 నంబర్‌కు ఫోన్ చేసి పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఈ సందర్భంగా కనకాల సుబ్బారావు మెమోరియల్ ట్రస్ట్ తరఫున కనకాల వెంకటేశ్వరరావు, బుల్లేశ్వరప్రసాద్‌లు జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్ ఎగ్జిబిషన్‌కు రూ.15 వేల నగదును జిల్లా సైన్స్ అధికారులు సుబ్రహ్మణ్యంకు డీవైఈవో నరసింహ ఫణి చేతుల మీదుగా అందజేశారు. సమావేశంలో సీనియర్ హెచ్‌ఎం పోలిశెట్టి రాంబాబు, రామచంద్రపురం డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాలకు చెందిన మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాలు

- గడప గడపకూ మన ప్రభుత్వ లక్ష్యం
- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ సూర్యప్రకాశ్


తోటవారివీధిలో గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్ తదితరులు

రామచంద్రపురం: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పారదర్శకంగా సామాన్యులకు చేరుతున్న విధానాన్ని పరిశీలించడమే గడప గడపకూ మన ప్రభుత్వ లక్ష్యమని దేశంలో మరే రాష్ట్రంలో కనీసం ఊహించని విధంగా రాష్ట్రంలో సామాజిక మహా విప్లవానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. పట్టణంలోని 10వ వార్డు తోటవారి వీధి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సూర్యప్రకాశ్ పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రజలు విన్నవించిన సమస్యలను అధికారులకు చెప్పి పరిష్కారానికి ఆదేశించారు. గత అయిదేళ్లుగా ప్రభుత్వం అందిస్తున్న లబ్ధిని లబ్ధిదారులకు వివరిస్తూ తీసుకుంటున్న చర్యలను, కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అమ్మ ఒడి, విద్యా దీవెన, ఆసరా, చేయూత, వసతి దీవెన, పింఛన్లు, గృహ నిర్మాణాలు, రైతు భరోసా, గోరుముద్ద వంటి సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. సూర్యప్రకాశ్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో ఈ ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందన్నారు. ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని, పరిష్కారానికి ఆదేశిస్తామని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారం దిశగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని పథకాలు అందడం లేదనేది ఈ ప్రభుత్వ పాలనలో ఉండదన్నారు. సంక్షేమ పథకాల అమలు దేశంలో ఎక్కడా లేని విధంగా లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా జమ చేయటం జరుగుతుందని వివరించారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, మున్సిపల్ వైస్ చైర్మన్లు కోలమూరి శివాజీ, చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిలర్‌లు కేతా శ్రీను, తోట అమ్మాజీ, తదితర కౌన్సిలర్‌లు, మాజీ జెడ్పీటీసీ ఇంత సంతోషం, మాజీ కౌన్సిలర్ నాగిరెడ్డి ప్రసాద్, పార్టీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, పార్టీ నాయకులు తోట సూరిబాబు, సత్తిశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

ప్రతి కుటుంబానికి వైద్యాన్ని దగ్గరగా అందించటం ఈ ప్రభుత్వ లక్ష్యమని అందుకోసమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. పట్టణంలో కోట హరిజనపేట అర్బన్ హెల్త్ సెంటర్లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్షలో పాల్గొని ఆరోగ్య కార్డులను సూర్యప్రకాశ్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ దేశంలోనే ఏ రాష్ట్రంలోని చేయలేని కార్యక్రమం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రతి పేదవాడికి ఆరోగ్యం అందించేలా ఈ జగనన్న సురక్ష మొదలుపెట్టారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసులు, వైస్ చైర్మన్లు కోలమూరు శివాజీ, చింతపల్లి నాగేశ్వరావు, డాక్టర్లు సుధీర్, హరీష్, మాజీ జెడ్పీటీసీ ఇంత సంతోషం, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వెల్ల సావరంలో..

ప్రతీ ఇంటిలోనూ..గడప గడపలోనూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉన్నారన్న భరోసా కనిపిస్తోందని రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. మండలంలోని వెల్ల శివారు వెల్లసావరంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులలతో కలసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆయా కుటుంబాలకు జరిగిన మేలును గణాంకాలతో సహా వివరిస్తూ ప్రతి కుటుంబానికి భరోసా ఇచ్చిన నాయకులు జగనన్నకు రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలన ప్రజలను కోరారు. గ్రామ సర్పంచ్ వీరబోయిన సూరిబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ అంబటి భవాని, డీసీఎంస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ వట్టికూటి ఏసుబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు తోట వీరభద్రరావు, గ్రామ నాయకులు కేవీవీ సత్యనారాయణ(డాక్టర్ బాబు), గుత్తుల రాంప్రసాద్, పాముల సురేష్, పోలినాటి వరప్రసాద్, పంతగత విజయప్రసాద్, పంచాయతీ కార్యదర్శి రాయుడు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బందికి రూ.11 వేల అపరాధ రుసుం

- వసూలు చేసిన డ్వామా పీడీ మదుసూధన్
- మండల స్థాయి సోషల్ ఆడిట్


రాయవరంలో నిర్వహిస్తున్న మండల స్థాయి సోషల్ ఆడిట్ సమావేశం

రాయవరం: గత ఆర్థిక సంవత్సరంలో మండలంలో నిర్వహించిన ఉపాధి హామీ పనులపై అధికారుల ఆధ్వర్యంలో మండల స్థాయి సోషల్ ఆడిట్ నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంపీపీ నౌడు వెంకటరమణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డ్వామా పీడీ ఎస్.మదుసూధన్ వివిధ గ్రామాల్లో గుర్తించిన లోపాలకు రూ.11 వేల అపరాధ రుసుంను ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ల నుంచి రాబట్టారు. పని చేసిన ప్రాంతాల్లో నేమ్ బోర్డులు ఏర్పాటు చేయనందున రూ.2,24,400 సొమ్మును తిరిగి సీఆర్‌డీ అకౌంట్‌కు జమ చేసినట్టు తెలిపారు. 16వ రౌండ్ సోషల్ ఆడిట్ పబ్లిక్ హియరింగ్‌లో మండల స్థాయిలో అన్ని గ్రామాల్లో నిర్వహించిన సామాజిక తనిఖీ నివేదికలను చదివి వినిపించారు. సమావేశంలో జిల్లా అంబుడ్స్‌మన్ ఎం.జ్యోతి, డిస్ట్రిక్ట్ విజిలెన్స్ అధికారి కర్రి భీమేశ్వరరావు, ఎస్‌ఆర్‌పీ ఎన్.సత్యనారాయణ, క్లస్టర్ ఏపీడీ ఎం.సత్యనారాయణ, ఏపీవో సుధారాణి, జేఈఈ ఎం.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శివాలయం నిర్మాణానికి చంద్రశేఖర్ విరాళం


విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందిస్తున్న చంద్రశేఖర్

కె.గంగవరం: మండలంలోని సుందరపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయం నిర్మాణానికి జనసేన నాయకులు పోలిశెట్టి చంద్రశేఖర్ విరాళం అందించారు. ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయంగా రూ.50 వేలను కమిటీ సభ్యులను సీరెడ్డి సత్తిబాబు ఇతర పెద్దలకు అందించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు సత్తిబాబు మాట్లాడుతూ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఆలయానికి దాతలు సహాయం చేయడానికి ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీటీసీ రాజు పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సామూహికంగానే ఎలుకల నిర్మూలన సాధ్యం


వెదురుమూడిలో రైతులకు సూచనలు చేస్తున్న డీడీఏ వెంకటేశ్వరరావు

కపిలేశ్వరపురం: ప్రణాళికాబద్ధంగా రైతులు చేసే సామూహిక ప్రయత్నంతోనే వ్యవసాయ క్షేత్రాల్లో వరి పంటను నాశనం చేసే ఎలుకల నిర్మూలన సాధ్యపడుతుందని గుంటూరు వ్యవసాయ కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన పర్యవేక్షణాధికారి, వ్యవసాయ శాఖ ఉప సంచాలకుడు డి.వెంకటేశ్వరరావు అన్నారు. కపిలేశ్వరపురం మండలం వెదరుమూడిలో బుధవారం నిర్వహించిన ఎలుకల మందు పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఆయనకు ఆలమూరు ఏడీఏ కె.నాగేశ్వరరావు, ఏఓ కేవీఎస్ రమేష్‌కుమార్ స్వాగతం పలికారు. వారు మాట్లాడుతూ ఎలుకల నిర్మూలన కార్యక్రమం శాస్త్రీయ పద్ధతిలో చేపట్టాలన్న లక్ష్యంతో బ్రోమోడయోలిన్ మిశ్రమాన్ని అన్ని ఆర్బీకేల్లోనూ ఒకే రోజు పంపిణీ చేశామన్నారు. రైతులు సామూహిక ప్రయత్నంతో వరి పంటను రక్షించుకోవాలని సూచించారు. కపిలేశ్వరపురం మండలంలోని 17 గ్రామాల్లో సచివాలయాల వ్యవసాయ సహాయకుల ఆధ్వర్యంలో ఆర్బీకేలు వద్ద 15,802 ఎకరాల రైతులకు 72 కిలోల బ్రోమోడయోలైన్ మందును పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో పీఏసీఎస్ చైర్మన్లు పాల్గొన్నారు.

మండపేట మండలంలో...

మండలంలోని 12 గ్రామాల్లోని ఆర్బీకేలు వద్ద బుధవారం ఎలుకల మందు మిశ్రమాన్ని రైతులకు పంపిణీ చేశారు. వెలగతోడులో నిర్వహించిన పంపిణీ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ముక్కపాటి కోటేశ్వరరావు, మండపేట పీఏసీఎస్ చైర్మన్ పెంకే గంగాధర్, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

మందు పంపిణీకి సిద్ధం

రామచంద్రపురం రూరల్: మండలంలోని అన్ని ఆర్‌బీకేల్లో గురువారం నుంచి రైతులకు ఉచితంగా పంపిణీ చేయడానికి ఎలుకల మందును ప్రభుత్వం సిద్ధం చేసిందని మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ మేరకు మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆర్‌బీకేల సిబ్బందికి సామూహిక ఎలుకల నివారణకు చేపట్టవలసిన చర్యలపై అవగాహన కల్పించారు. మండలానికి 84 కేజీల బ్రోమోడయోలిన్ వచ్చిందన్నారు. దీనిని రైతులకు పంపిణీ చేయడానికి అనువుగా నూకలు, నూనెలతో కలిపి తయారు చేసే విధానాన్ని వివరించారు. గురువారం మండలంలోని 20 ఆర్‌బీకేల్లో మందు పంపిణీకి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.